# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 13, ఏప్రిల్ 2026


## భీం పోరు గడ్డపై డీజీపీ సందడి..

★ గిరి పోరాటయోధునికి ఘన నివాళి ★ వాహనదారులకు హెల్మెట్లు, గిరి మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ: డిజిపి బి శివధర్ రెడ్డి



**కెరమెరి ఏప్రిల్ 12 ప్రభాతవార్త:** కొమురం భీం జిల్లాలోని కెరమెరి మండలం జోడేఘాట్‌లో రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి ఆదివారం పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా ఆదివాసి వీరుడు కుమురం భీం పురిటిగడ్డను సందర్శించిన డీజిపి ఆదివాసుల ఆరాధ్య దైవం, గిరిజన వీరుడు కొమురం భీం నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం గిరిజన మ్యూజియంలో కలియతిరిగారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన తొమ్మిది తెగల గిరిజనులకు మిగతా 2లో..



# రాష్ట్రంలో అరాచక రాజకీయం నడుస్తోంది

- ✦ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు
- ✦ రాష్ట్రానికి కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష.. మళ్లీ ఆయనే సీఎం కావాలి
- ✦ సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించకుంటే కొత్తగూడెం ముట్టడిస్తాం
- ✦ కేసీఆర్ హయాంలో 16 వేల మందికి కారుణ్య నియామకాలు
- ✦ కత్తి వారి చేతికి ఇచ్చి మమ్మల్ని పోరాడమంటే ఎలా?



**నస్పూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అరాచక రాజకీయం నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆదివారం మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో క్యాతన్‌పల్లిలో బీఆర్ఎస్, సీపీఐ కూటమి స్పష్టమైన మెజారిటీ సాధించినప్పటికీ, మంత్రి వివేక్ అహం దెబ్బతిని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. వెయ్యి మంది పోలీసులతో కవాతు నిర్వహిస్తూ కౌన్సిలర్లను భయభ్రాంతులకు గురిచేయడం ఇందిరమ్మ ఎమర్జెన్సీ కాలాన్ని తలపిస్తోందని మండిపడ్డారు. కోట్లాది రూపాయల ఆశ చూపినా, ఇళ్లు కూలగొడతామని బెదిరించినా బీఆర్ఎస్ కౌన్సిలర్లు లొంగకుండా ప్రజాస్వామ్యాన్ని గెలిపించారని కేటీఆర్ కొనియాడారు. జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అడ్డు తొలగించుకోవడానికే అక్రమంగా కేసులు పెట్టి 16 రోజులు మిగతా 2లో..

## ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్...
# విద్యార్థిని హాత్మహాత్య



విద్యార్థిని సౌజన్య (ఫైల్)

**ఉట్నూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :** ఇంటర్ పరీక్షల్లో విఫలం అవ్వడం ఓ అమాయక విద్యార్థినిని మృత్యువుకు నెట్టింది. జిల్లాలోని ఉట్నూరు మండలంలో ఈ విషాద ఘటన ఆదివారం చోటు చేసుకుంది. 17 ఏళ్ల సౌజన్య అనే విద్యార్థిని ఫలితాల్లో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉట్నూరు లోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్న సౌజన్య, ఆదివారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయింది. దీంతో తీవ్ర ఆందోళనకు గురై, మానసికంగా కృంగిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సౌజన్య ఉరి వేసుకున్న విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అందరితో కలివిడిగా ఉండే సౌజన్య ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆమె మృతి స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిలిచింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మారని దారులు..

## అధ్వానంగా జైనూర్-ఉట్నూర్ రహదారి

**జైనూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ నుండి ఉట్నూర్ వరకు ప్రధాన రహదారి అధ్వానంగా మారి రాకపోకలు నరకప్రాయంగా మారాయని వామపక్ష పార్టీల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు మంత్రులు వస్తూ వెళ్తున్నా, రహదారుల అభివృద్ధిని మాత్రం విస్మరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ విమర్శించారు. జైనూర్ నుంచి ఉట్నూర్ ఎక్స్ రోడ్డు వరకు దారి పొడవునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారిందని వారు పేర్కొన్నారు. ఈ గుంతల వల్ల వాహనాలు పాడవ్వడమే కాకుండా, అత్యవసర సమయాల్లో అంబులెన్స్ వెళ్లడం కూడా కష్టమవుతోందన్నారు. రోడ్డు సరిగా లేకపోవడం వల్ల ఎందరో గిరిజన గర్భిణీలు 108 వాహనంలోనే ప్రసవించిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం ఈ దారి గుండా ప్రయాణిస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరించడం దురదృష్టకరమని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే మిగతా 2లో..





# రాష్ట్రంలో అరాచక రాజకీయం నడుస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

జైల్లో ఉంచారని ధ్వజమెత్తారు. సింగరేణి సంస్థలో కాంట్రాక్టులన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి కనుసన్నల్లోనే నడుస్తున్నాయని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 16 వేల మందికి కారుణ్య నియామకాలు కల్పించామని గుర్తు చేశారు. ప్రస్తుతం మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే బోర్డు ఏర్పాటు చేసి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అభయహస్తం కాస్త ఖభస్మాసుర హస్తంగగా మారిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయికి తగని భాష వాడుతున్నారని విమర్శించారు. అమృత్ పథకం కాంట్రాక్టులు కూడా సృజన్ రెడ్డికే దక్కాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చీకటి దోస్తులని ఆరోపించారు. రాష్ట్రంలో ఖఆర్ఆర్ ట్యాక్స్‌గ వసూళ్లు జరుగుతున్నాయని ప్రధాని మోదీ, అమిత్ షా అంటున్నారే తప్ప ఎందుకు విచారణ జరిపించడం లేదని ప్రశ్నించారు. సింగరేణి కార్మికులు, రైతులు, పేదల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్నా, ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలన్నా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని, 2028లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే టీబీజీకేఎస్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మంచిర్యాలలో బీఆర్ఎస్ హయాంలోనే 38 ఎకరాల్లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి దాచుకోదోచుకో అన్న పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా నడిపిస్తున్నారని అన్నారు. కాళేశ్వరం కూలేశ్వరం అన్న సన్నాసి ముఖ్యమంత్రి, కాళేశ్వరం ప్రాజెక్టు లేనిదే ఇంత భారీగా ధాన్యం ఎలా పండిందో చెప్పాలి. కేసీఆర్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు లేకుండా దేశంలో అగ్రస్థానంలో ధాన్యం ఉత్పత్తిలో నిలబడిన తెలంగాణ ప్రస్థానం గురించి చెప్పాలి. కాంగ్రెస్ పార్టీ పాలనలో తెలంగాణ రాకముందు ఎండిపోయిన బోర్ల పైన ఆధారపడ్డ రైతుల బాధలను కేటీఆర్ గుర్తు చేశారు. ఎండిన బోర్లు, కరెంటు కోతలను దాటుకొని సస్యశ్యామలంగా ఉన్నది తెలంగాణ అంటే కేసీఆర్ ప్రాజెక్టులు కారణం కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. గోదావరి నది పైన కొత్తగా నిర్మాణాలు చేస్తామంటున్న కాంగ్రెస్ పార్టీకి మహారాష్ట్రతో ఏమన్నా ఒప్పందం జరిగిందా? ఎన్ని మీటర్లకు అంగీకారం కుదిరిందో చెప్పాలి. బడ్జెట్లో 52 కోట్లు పెట్టి బరాజ్‌లు కడతామంటే ఎలా సాధ్యమవుతుంది? సంవత్సరానికి 52 కోట్ల బడ్జెట్ తో ఎన్ని వందల సంవత్సరాలు ఈ బరాజ్‌లు కడతారో కాంగ్రెస్ చెప్పాలి. ఇగో కడతాం అగో కడతాం అనే బిల్డప్పు తప్ప సాగునీటి ప్రాజెక్టుల అతీగతీ లేదు. అంతకు ముందు బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

### కత్తి వారి చేతికి ఇచ్చి మమ్మల్ని పోరాడమంటే ఎలా?

కేటీఆర్ ప్రసంగిస్తుండగా, సభలో ఉన్న పలువురు సింగరేణి కార్మికుల వారసులు ప్లే కార్డులు ప్రదర్శిస్తూ తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. సింగరేణి బెల్ట్ ప్రాంతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను ఓడించి, ఇప్పుడు సమస్యలు పరిష్కరించమని మమ్మల్ని అడిగితే ఎలా సాధ్యమవుతుంది? కత్తిని కాంగ్రెస్ పార్టీ చేతిలో పెట్టి, మమ్మల్ని యుద్ధం చేయమంటే ఎలా? అని ప్రశ్నించారు. అధికారం కాంగ్రెస్ చేతిలో ఉన్నప్పుడు తాము కేవలం పోరాటం మాత్రమే చేయగలమని గుర్తు చేశారు.

### మున్సిపల్ ఎన్నికల విజేతలకు కేటీఆర్ ఘన సన్మానం..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ప్రసంగం అనంతరం ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులను ఘనంగా సన్మానించారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా, ధైర్యంగా పోరాడి గెలిచిన కౌన్సిలర్లను ఆయన శాలువాలు కప్పి అభినందించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అభ్యర్థులు చూపిన పట్టుదల స్ఫూర్తిదాయకమని కేటీఆర్ కొనియాడారు. ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వార్డుల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని విజేతలకు దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్ రావు, కోరుకంటి చందర్, కోనేరు కోనప్ప, టీబీజీకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యా లరాజి రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, క్యాతన్ పల్లి మున్సిపల్ ఛైర్పర్సన్ గోడిశెల సంధ్యారాణి, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భీం పోరు గడ్డపై డీజీపీ సందడి..

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాటుచేసిన ప్రతిమలను పరిశీలించారు. కొమురం భీం పోరాటపటిమా, ఆయన అనుచరుల ప్రతిమలను, గుస్సాడీ వేషధారణ పోలిన చిత్రాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం మ్యూజియంలోనే అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వెయ్యి మంది ద్విచక్ర వాహనదారులకు నాణ్యమైన హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డీజీపీ స్వయంగా వాహనదారులకు హెల్మెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్మెట్ ప్రతి వాహనదారుడికి ప్రాణ రక్షక కవచమని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. అలాగే పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా 50 మంది ఆదివాసి మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని డీజీపీ పేర్కొన్నారు. పోలీస్ శాఖ ప్రజల భద్రతతో పాటు వారి సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందన్నారు. కార్యక్రమం అనంతరం ఆదివాసి కళాకారులు సంప్రదాయ దింసా, గుస్సాడి నృత్యాలతో ఆకట్టుకున్నారు. డీజీపీ కళాకారుల ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించి వారితో కలిసి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమాల్లో ఎస్పీ నితికా పంత్, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, వాంకిడి సీఐ సత్యనారాయణ, కెరమెరి ఎస్సై మధుకర్ తదితరులు, పోలీస్ సిబ్బంది, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మారని దారులు..

(మొదటిపేజీ తరువాయి)

స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ



కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి గోగర్ల తిరుపతి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మాకూరి చిరంజీవి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గోడిసెల కార్తీక్, గెడం టికానంద్, జాదవ్ రాజేందర్, జిల్లా నాయకులు దుర్గం రాజ్‌కుమార్, నిఖిల్ పాల్గొన్నారు.

## జేసీఐ నిర్మల్ స్ఫూర్తి చాప్టర్ ప్రారంభం

**- అధ్యక్షుడిగా వాడేకర్ లక్ష్మణ్**

**నిర్మల్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**

యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ వ్యక్తిత్వ వికాసానికి కృషి చేసే అంతర్జాతీయ సంస్థ జేసీఐ (జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్) నిర్మల్ పట్టణంలో తన కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. జేసీఐ నిర్మల్ స్ఫూర్తి పేరిట ఏర్పాటైన ఈ కొత్త చాప్టర్ ప్రారంభోత్సవం, కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం పట్టణంలోని హోటల్ మారుతి ఇన్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి హాజరై ప్రసంగించారు. యువతలో దాగి ఉన్న అపారమైన ప్రతిభను వెలికితీయడానికి జేసీఐ వంటి వేదికలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. నాయకత్వం అంటే బాధ్యత అని, సమాజాన్ని మార్చే శక్తి ప్రతి యువకుడిలో ఉంటుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జేసీ వాడేకర్ లక్ష్మణ్ జేసీఐ నిర్మల్ స్ఫూర్తి ఫౌండర్ ప్రెసిడెంట్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. అధికారికంగా కాలర్ ధరింపజేసి ఆయనకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం సంస్థ కార్యవర్గ సభ్యులుగా జేసీ డి. విశ్వశ్రీ (సెక్రటరీ), జేసీ అనిల్ దూగ్గే (ట్రెజరర్), జూనియర్ జేసీ ప్రీతం (ఛైర్మన్) బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా డాక్టర్ అల్లిడి సురేష్, గంధం సాయినాథ్, రమేష్, వెంకట్ రాకొండే, సాయి కిరణ్, గౌతమ్, రాజేష్, శ్రీలత తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. జోన్ అధ్యక్షులు గౌతమ్ కుమార్ జైన్, జోన్ వైస్ ప్రెసిడెంట్ గుండం మహేందర్ హాజరై సభ్యులకు మార్గదర్శనం చేశారు. నేషనల్ ట్రైనర్ సాయి కిరణ్ బంటు నాయకత్వ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చి, పాల్గొన్న 20 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి

**- హెల్మెట్ చౌక్‌ను ప్రారంభించిన డిజిపి**

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :**



రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలని రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి వాహన చోదకులకు సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ చెక్ పోస్ట్ వద్ద జిల్లా ఎస్పీ నితికా పంత్, ఏఎస్పీ తో కలిసి హెల్మెట్ చౌక్ ను ప్రారంభించారు. ఏ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ అరైవ్ అలైవే కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ పట్టణంలోని చెక్‌పోస్ట్ వద్ద భారీ హెల్మెట్ ఆకార నిర్మాణంలో హెల్మెట్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెల్మెట్ వినియోగంపై అవగాహన కోసం ఈ కార్యక్రమంను ప్రారంభంచేసినట్లు వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే సందేశాన్ని ప్రజల్లో బలంగా చేరవేయాలన్న లక్ష్యంతో ఈ ప్రత్యేక నిర్మాణాన్ని ఏర్పాటు చేశామని, హెల్మెట్ వినియోగం ప్రాణ రక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి వాహనదారు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని చెప్పారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంచేందుకు ఈ హెల్మెట్ చౌక్ ఒక ప్రతీకగా నిలుస్తుందని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తమ భద్రతకు అత్యవసరమని అధికారులు సూచించారు. రోడ్డు నియమాలను పాటించడం ద్వారా మన ప్రాణాలను కాకుండా ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు, ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్, సిఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన మహర్ ప్రీమియర్ లీగ్

**- జై భీమ్ జట్టు విజయం.. బహుమతుల ప్రదానం**

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :**



గత పది రోజులుగా స్థానిక ఎస్పీయం గ్రౌండ్‌లో నిర్వహించిన మహర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. టోర్నమెంట్‌లో మహర్ క్రీడాకారులు ఉపాధ్యాయులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో సీతానగర్ (ఈస్గాం) కు చెందిన జై భీమ్ జట్టు, కుమ్మెగూడకు చెందిన ప్లే బాయ్ జట్లు తలపడగా జై భీమ్ జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు తొలి బహుమతిగా రూ.20 వేల నగదును డాక్టర్ సునీత రావుజి, సూరన్న, తుమ్మలగూడ సర్పంచ్ కొండ రామ్ ప్రసాద్, సామాజిక కార్యకర్త జాడి శశికళ సంయుక్తంగా అందజేశారు. ద్వితీయ బహుమతిగా మహర్ సంఘ నాయకుడు జాడి దీపక్ రూ.10 వేల నగదును ప్రదానం చేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును మెడీ చరణ్ దాస్ అందించారు. ఎస్పీయం జీఎం ఎంఎస్ గిరి ప్రత్యేక అతిథిగా హాజరై క్రీడాకారులకు బహుమతులు అందజేసి యువతను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మహర్ నాయకులు దొంగ్రి సునీల్, జాడి శ్యామ్‌రావు, జాడి శివరామ్, దొంగ్రి కార్తీక్, సురేష్, దొంగ్రి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో ఎస్.ఆర్ బాలికల విజయదుందుభి

**నిర్మల్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**

ఇంటర్మీడియట్ ఫలితాల్లో నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్ గర్ల్స్ కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. బైపీసీ, ఎంపీసీ విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా పేరును రాష్ట్రస్థాయిలో నిలిపారు.

**ప్రథమ సంవత్సరం ఫలితాలు**

బైపీసీ విభాగంలో ఇ. ఆరాధ్య 440 మార్కులకు గాను 438 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. సఫా మహీన్ (437), జి. ఆలేఖ్య (436), అయేషా రిధ (434), ఇ. నవ్య (432) ఉత్తమ మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో సిద్రా రహీన్ 470 మార్కులకు 465 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకు దక్కించుకున్నారు. ఎస్. హర్షిణి (464), ఎస్. సంజన (461), శ్రీ వన్య (461), రక్షిత (460) ప్రతిభ చాటారు.

**ద్వితీయ సంవత్సరం ఫలితాలు**

ఎంపీసీ విభాగంలో డి. శ్రీనిధి 1000 మార్కులకు 993 మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. వీరితో పాటు అయేషా (990), శ్రీజ (990), శిరీష (990), శృతిక (989), లక్షి ్మ ప్రసన్న (989) అత్యుత్తమ మార్కులు పొందారు. బైపీసీ విభాగంలో బి. శ్రీలక్షి ్మ 1000 మార్కులకు 993 మార్కులు సాధించగా, డి. గౌరి (992), కె. అఖిల (990), ఎం. శ్రీజ (989) రాష్ట్రస్థాయిలో విజయదుందుభి మోగించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను విద్యాసంస్థల ఛైర్మన్ వరదారెడ్డి, డీజీఎం గోవర్ధన్ రెడ్డి, జోనల్ ఇంచార్జ్ నగేష్ యాదవ్, డీన్ రాంబాబు, ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు. భవిష్యత్తులో నీట్, జేఈఈ మెయిన్స్, ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షల్లోనూ ఇదే జోరు కొనసాగించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన తల్లిదండ్రులకు, అధ్యాపకులకు యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.





## ఘనంగా డా. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం

**చెన్నూరు, ఏప్రిల్ 12 ప్రభాతవార్త**

మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతిని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం ఎర్రగుంటపల్లి గ్రామంలో శనివారం రోజున భారత రత్న డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దొంత శ్రీకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అన్ని కుల సామాజిక వర్గాలకు ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. భారతదేశంలో సమసమాజ నిర్మాణం ఏర్పడడానికి ఆయన ఎంతో కృషి చేశారాన్నారు. భారతదేశానికి ఆయన చేసిన సేవలకు గాను భారత రత్న అవార్డు కేంద్ర ప్రభుత్వం ప్రధానం చేసిందన్నారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి వేడుకల్లో భాగంగా ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేస్తూ ఆయనను స్మరించుకున్నారు. మహిళలు చదువుకునేందుకు బళ్ళు కట్టించి తన భార్య సావిత్రి బాయినే దేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా చేసారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గోదావరిలో మునిగి బాలుడు మృతి

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 12, ప్రభాతవార్త**



పట్టణంలోని కోర్టు ఏరియాకు చెందిన మహమ్మద్ ఉస్మానుద్దీన్ (14) అనే విద్యార్థి ఈత రాక ప్రమాదవశాత్తు గోదావరి నీటిలో మునిగి చనిపోయినట్లు ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. మృతుడు ఆదివారం రోజు మధ్యాహ్నం ఇంటి నుండి లక్షెట్టిపేట గోదావరి నదిలో స్నానానికి వెళ్ళాడు. నీటిలో దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగాడు. ఇది గమనించిన మస్తాన్ గూడకు చెందిన షేక్ అమన్ అను అతడు విషయం కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలపడంతో కుటుంబ సభ్యులు వచ్చి గోదావరి నీటిలో వెతకగా మృతదేహం లభ్యమైంది. వెంటనే అతన్ని లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి చూపించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని పెద్దనాన్న షఫీఉద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.

## అరైవ్ అలైవ్‌ను విజయవంతం చేయాలి

### - నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి

**వేమనపల్లి, ఏప్రిల్ 12, ప్రభాతవార్త**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని గ్రామాలలో విజయవంతంగా నిర్వహించాలని నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి అన్నారు. నేటి నుండి సోమవారం నుంచి ప్రతి ఒక్క గ్రామంలో రోడ్డు ప్రమాదాలలో కోల్పోతున్న ప్రాణాలను నివారించడానికి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవడానికి సర్పంచులు గ్రామ సభలను ఏర్పాటు చేసి అరైవ్ అలైవ్ కార్యక్రమం గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించి, గ్రామాలలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా అవుతున్న ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవలసిందిగా కోరారు. ఇట్టి కార్యక్రమానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలన్నారు.

## బోర్‌కు కొత్త స్టాటర్ ఏర్పాటు

**వేమనపల్లి, ఏప్రిల్ 12, ప్రభాతవార్త**



వేమనపల్లి మండలం సుంపుటం గ్రామంలో స్కూల్ దగ్గర స్టాటర్ కాలిపోయింది అని తాగునీటికి ఇబ్బంది అవుతుందని ప్రజలు చెప్పగానే వెంటనే సర్పంచ్ దుర్గం భాగ్యలక్ష్మి తిరుపతి స్పందించి తాగునీటికి ఇబ్బంది లేకుండా కొత్త స్టాటర్ తెప్పించి సిబ్బందితో అమర్చి మంచినీళ్లను అందించారు. దీంతో గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజలకు చేరువగా ఆధునిక పోలీస్ సేవలు

### * కన్నెపల్లిలో నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 12, ప్రభాతవార్త**



ప్రజల రక్షణ, సమస్యల పరిష్కారం, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ అహర్నిశలు కృషి చేస్తోందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని కన్నెపల్లి మండల కేంద్రంలో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. మల్టీ జోన్1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ ఎ. భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఏసీపీ కిరణ్ కుమార్ తదితరులతో కలిసి డీజీపీ పోలీస్ గౌరవ వందనం స్వీకరించి భవనాన్ని ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువలో మెరుగైన సేవలు అందించేందుకు ఈ ఆధునిక భవనం ఉపయోగపడుతుందని చెప్పారు. సాంకేతికతను వినియోగించి భద్రతను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. తదనంతరం బెల్లంపల్లి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆటో, లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించడం తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని హెచ్చరించారు. చిన్న చిన్న జాగ్రత్తలే ప్రాణాలను కాపాడతాయని, ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు ఒక కుటుంబాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు భీమా చెక్కులను అందజేశారు. అనంతరం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని దుర్గామాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు రామగుండంలోని జ్యోతి గెస్ట్ హౌస్‌కు చేరుకున్న డీజీపీకి జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పోలీస్ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జయంతి వేడుకలను విజయవంతం చేయండి

**నిర్మల్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి మహోత్సవాలను ఈ నెల 14న నిర్మల్ జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి. దయానంద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జయంతి వేడుకలు మంగళవారం ఉదయం 9:30 గంటలకు న్యూ బస్ స్టాండ్ వద్ద గల మినీ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో ప్రారంభమవుతాయి. అనంతరం ఉదయం 10:30 గంటలకు భాగ్యనగర్ వార్డు నంబర్ 41లోని అంబేద్కర్ భవనంలో బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దయానంద్ కోరారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన మార్కెట్ చైర్మన్లు

**సారంగాపూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**

మండలంలోని ప్యారామూర్ గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్మల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సోమ భీమారెడ్డి, సారంగాపూర్ మార్కెట్ చైర్మన్ అబ్దుల్ ఆది, డీసీసీ అధికార ప్రతినిధి కొట్టే శేఖర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు సాయన్న, లింగారెడ్డి, లక్ష్మణ్, భూమారెడ్డి, రమేష్, నరసయ్య పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మార్కెట్ చైర్మన్లు

## చట్ట సభల్లో ప్రవాస భారతీయులకు నామినేటెడ్ పోస్టులు కల్పించాలి

**జన్నారం, ఏప్రిల్ 12, ప్రభాతవార్త**

చట్ట సభల్లో ప్రవాస భారతీయులకు నామినేటెడ్ పోస్టులు కల్పించాలి అని ప్రవాస భారతీయుల విశ్లేషకులు,తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి యుఎఇ దుబాయ్ శాఖ అధ్యక్షులు ఎరుకల రాజు గౌడ్ అన్నారు. ఆయన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వ ఎన్ఆర్ఐ అడ్వైజర్ కమిటీ వైస్ చైర్మన్ మంద భీం రెడ్డితో భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎన్ఆర్ఐ పాలసీతో కూడిన గల్ఫ్ బోర్డ్ అధ్యయనంలో భాగంగా మాట్లాడుతూ ప్రవాస భారతీయులు తమ ప్రతీ రక్తపు బొట్టును చెమటగా మార్చి రెమిటెన్స్ రూపంలో దేశానికి పంపిస్తున్నారని, ఇది ఇండియన్ ఫారెక్స్‌ను దేశ ఆర్థిక అసమానతలను కాపాడుకోవడం కోసం ఎంతో ఉపయోగపడుతుంది అని, అలాంటి వారికి చట్ట సభల్లో నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించే విధంగా ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలి అని అన్నారు. రాజ్యసభకు కళ, సాహిత్యం, సామాజిక సేవ వంటి రంగాల్లో ప్రతిభ కనబరిచిన వ్యక్తులను నామినేట్ చేసే అవకాశం ఉందని, ఇదే తరహాలో ప్రవాస భారతీయుల ప్రాతినిధ్యం కోసం వారి సంక్షేమం కోసం ఒక ప్రత్యేక బడ్జెట్‌తో పాటు నామినేటెడ్ పోస్టులు కోటా వారి కోసం ఏర్పాటు చేయాలని కోరారు. వారి సమస్యల్లో కొన్ని అంటే వీసా,పెట్టుబడులు, డబుల్ టాక్సేషన్, ప్రాపర్టీ వివాదాలు లాంటి సమస్యలు చట్టసభల్లో చెప్పుకునే వీలు కలుగుతుందని, అలాగే భారత్ వారి ఇతర నివాస దేశాల మధ్య ఆర్థిక సాంస్కృతిక వారధిగా దేశ, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుంది అని అన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంద భీం రెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారని తెలిపారు.

## వ్యక్తి మృతి

**సారంగాపూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**



అతిగా మద్యం సేవించి ఓ వ్యక్తి మరణించిన సంఘటన సారంగాపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. సారంగాపూర్ గ్రామానికి చెందిన పోచమ్మల ఎల్లయ్య (32) యాచకుడిగా జీవనం సాగిస్తూ, అడెల్లి దేవాలయం వద్ద భిక్షాటన చేసేవారు. ఆదివారం అడెల్లి వద్ద అతిగా మద్యం సేవించిన ఎల్లయ్య, తనకు అనారోగ్యంగా ఉందని, ఇంటికి వెళ్లి పడుకుంటానని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ క్రమంలో ఇంటికి వెళ్తున్న దారిలో సారంగాపూర్ బస్ స్టాండ్ సమీపంలోని ఒక కిరాణా షాపు వద్ద అకస్మాత్తుగా బోర్లా పడిపోవడంతో అక్కడిక్కడే ప్రాణాలు విడిచారు. మృతుడి తమ్ముడు గంగారాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# రక్తదాన శిబిరానికి భారీ స్పందన

## - టిఎస్‌యూటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :**




కాగజ్‌నగర్‌లోని స్థానిక ఆదిత్య నర్సింగ్ హోమ్‌లో ఆదివారం టిఎస్‌యూటిఎఫ్ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహనీయులు బాబు జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే, డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి, టిఎస్‌యూటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన వచ్చినట్లు టిఎస్‌యూటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు, యువత, సామాజిక కార్యకర్తలు భారీగా హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిఎస్‌యూటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్ మాట్లాడుతూ రక్తదానం మనిషి చేయగలిగిన అత్యున్నత సేవలలో ఒకటని తెలిపారు. రక్తానికి ప్రత్యామ్నాయం ఏదీ లేదని, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు ప్రాణదానం చేసే శక్తి రక్తదానానికే ఉందని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్యవంతుడైన వ్యక్తి మూడు నుండి నాలుగు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని, సమాజంలో రక్త కొరత సమస్యను తగ్గించేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, వైస్ ఛైర్‌పర్సన్ అనిత మాట్లాడుతూ సమాజంలో మానవతా విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థుల్లోనూ, యువతలోనూ సేవాభావాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలవాలని, ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవ సమయాల్లో రక్తం అత్యవసరంగా అవసరమవుతుందని, అలాంటి సమయాల్లో రక్తదాతల సహకారం ఎంతో కీలకమని చెప్పారు. ప్రతి ఒక్కరూ రక్తదానం పై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ఇతరులను కూడా ప్రోత్సహించాలని కోరారు. ఈ రక్తదాన శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సమాజ సేవలో భాగంగా ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి ప్రధాన కార్యదర్శి ఉష్కన్న, మంచిర్యాల జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శి రాజవేణు, డా రావూజీ, డా సునీత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, కాగజ్‌నగర్ మండల ఎంఈఓ వాసాల ప్రభాకర్, మేడి చరణ్‌దాస్, చిలుకూరి సత్యనారాయణ, కటుకం మధుకర్, జిల్లా నాయకులు ఇందు రావు, ప్రీతి, రమేష్, రాజ కమలాకర్ రెడ్డి, మహిపాల్, దుర్గయ్య, సుభాష్, వివిధ ప్రజాసంఘాల నాయకులు త్రివేణి,వినోద, ఆనంద్‌కుమార్,శ్రీనివాస్, పావని, అనిత, ముంజం శ్రీనివాస్, ఈర్ల సునీల్, డి సంతోష్, మండలాల నాయకత్వం మహేష్, బాలకృష్ణ, హరీష్, మహేందర్, సచిన్, మల్లన్న,సాయి, వినోద్, గుణాకర్, మూర్తి, రవి,, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల జూనియర్ కళాశాలలో 100 ఉత్తీర్ణత

### - గురుకుల ప్రిన్సిపాల్. కె.రమా కళ్యాణి

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 12, ప్రభాతవార్త**


బి. ప్రజ్ఞ


డి. ప్రహస్య

లక్షెట్టిపేటలోని గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత విద్యార్థులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ కే. రమ కళ్యాణి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 74 విద్యార్థులకు గాను 74, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 65 మంది విద్యార్థులకు గాను 65 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండవ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బి ప్రజ్ఞ 995, ఏ. కావ్య 986, బైపీసీ విభాగంలో డి. ప్రహస్య 986, చైతన్య, అంజలి, హారికలు 980 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం బైపీసీ విభాగంలో శ్వేత 437, స్పందన 435, ఎంపీసీ విభాగంలో సాయి త్రినేత్ర 468, సహస్ర 465, మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో నిలిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. 100కు 100 ఉత్తీర్ణత సాధించడంతోపాటు రాష్ట్ర స్థాయిలో మూడు ర్యాంకులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## అవుట్ రీచ్ మ్యాప్ సంస్థ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ ప్రారంభం

**తిర్యాని, ఏప్రిల్ 12, ప్రభాతవార్త**

తిర్యాని మండలంలోని గుండాల (అలీగూడ )గ్రామంలో ఆదివారం అవుట్ రీచ్ మ్యాప్ సేవా సంస్థ మంచిర్యాల ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటుచే చేశారు.14 మంది గిరిజన మహిళలకు 4 నెలల కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి, సర్టిఫికేట్ అర్హులైన వారికి కుట్టు మిషన్ పంపిణీతో పాటు సర్టిఫికెట్ ఇస్తామని ఆ సంస్థ సెక్రటరీ కార్లేన్ వింగ్ తెలిపారు. స్త్రీలు స్వయం కృషితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బి ప్రమోద్, గెడం లింగు, లక్ష్మణ్, సంతోష్, ట్యూటర్ ప్రశాంత పాల్గొన్నారు.

## హిందూ సమాజ్ కమిటీ ఎన్నిక

**ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త**

హిందూ సమాజ్ బ్రాహ్మణవాడ నూతన కమిటీ ఎన్నికలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షులుగా రాజేశ్వర్‌రావ్ మసాదె, ఉపాధ్యక్షులుగా సింగాడె అశోక్ ను సభ్యులు ఎకగ్రీవంగా ఎన్నుకొన్నారు. పూర్తిస్థాయిలో కమిటీ సభ్యులను త్వరలోనే ఎన్నుకోనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతు హిందూ సమాజ్ బలోపేతం కోసం సంఘం కృషి చేస్తుందని, మిగతా కార్యవర్గాన్ని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఈనెల 24వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రేమలాగార్డెన్లో నిర్వహించే హిందూ సమ్మేళన కార్యక్రమంలో హిందూవులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హిందూసమాజ్ బ్రాహ్మణవాడ సభ్యులు మసాదె బల్వంత్, ఆష్టే అనూప్, శ్రీకాంత్, ప్రవీణ్, ధనాజ్, శంకర్, రామారావ్, ప్రదీప్, వెంకటపీందర్, మహేష్, చంద్రకాంత్, ఖాండ్రె విశాల్, రాజేష్, జయంత్, సురేష్పరి, వంశీ, రామారావ్ తదితరులు పాల్గొన్నారు.


కమిటీ సభ్యులను సన్మానిస్తున్న స్థానికులు

## మోడల్ స్కూల్‌లో మెరుగైన ఫలితాలు.. 98 శాతం ఉత్తీర్ణత

**జైనూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**

ఇంటర్మీడియట్ ఫలితాల్లో సిర్పూర్(యు) పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ కాలేజీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ వెంకటస్వామి తెలిపారు. మొదటి సంవత్సరంలో 98 శాతం, రెండో సంవత్సరంలో 93 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు. మొదటి సంవత్సరంలో 133 మందికి గాను 131 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో ఆడ వివేక్ రాజ్ (454/470) కళాశాల టాపర్‌గా నిలిచారు. బైపీసీలో జాదవ్ పూజ (425/440), సీఈసీలో ఆత్రం లక్ష్మీబాయి (429/500) ఉత్తమ మార్కులు సాధించారు. రెండో సంవత్సరంలో 112 మందికి గాను 105 మంది ఉత్తీర్ణత సాధించారు. బైపీసీలో సయ్యద్ అతీఫ్, రాథోడ్ విద్య (949/1000) టాపర్లుగా నిలవగా, ఎంపీసీలో ముండే గణేష్ (937), సీఈసీలో రాజేంద్ర ప్రసాద్ (883) ప్రతిభ చాటారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రభుత్వ కళాశాల విద్యార్థుల విజయఢంకా

**బెజ్జూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆదివారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు.కళాశాలలో 69.86 ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ స్వపన్ కుమార్ మండల్ తెలిపారు.ఎంపీసీ ద్వితీయ సంవత్సరం ఎన్.నాగరాజు 763/1000,ఎన్.సాయిచరణ్ 729/100,ఎంపీసీ ప్రథమ సంవత్సరం కె.రాజేష్ 448/470,ఏ.శివ ప్రసాద్ 374/470,బైపిసి ద్వితీయ సంవత్సరం జి.పవన్ 909/100, వి.సౌజన్య 847/1000 మార్కులతో విజయ ఢంకా మోగించినట్లు తెలిపారు.





## మార్కులే జీవితం కాదు.. ఆత్మహత్య పరిష్కారం కాదు: జాడే లక్ష్మణ్

**భైంసా, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**




పరీక్షల్లో వచ్చే మార్కులే జీవితాన్ని నిర్ణయించవని, ఫలితాలు ఆశించినట్లు రానంత మాత్రాన ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదని సామాజిక కార్యకర్త జాడే లక్ష్మణ్ అన్నారు. ఆదివారం భైంసా పట్టణంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పరీక్షల్లో ఓటమి అనేది శాశ్వతం కాదని, మన ముందు మరెన్నో అవకాశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. చదువు అనేది జీవితంలో ఒక భాగం మాత్రమేనని, చదువు ఒక్కటే మొత్తం జీవితం కాదని విద్యార్థులకు సూచించారు. ఆత్మహత్య అనేది సమస్యకు పరిష్కారం కాదని, అది కన్నవారికి తీరని కన్నీళ్లే మిగిలిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ఆశలను మరణంతో ముడివేయవద్దని, తండ్రి మనోవేదనను అర్థం చేసుకోవాలని కోరారు.ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి సాధిస్తే ప్రపంచ చరిత్రలో ఒక శిలాఫలకంలా నిలిచిపోవచ్చని పేర్కొన్నారు. నిరాశతో ప్రాణాలు తీసుకోవడం కంటే, బతికి విజయాన్ని సాధించి చూపడమే అసలైన గెలుపు అని లక్ష్మణ్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో నేరడిగొండ విద్యార్థుల ప్రభంజనం

**నేరడిగొండ, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ, టీటీడబ్ల్యూఆర్ బుగ్గారం కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచినట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ తెలిపారు.బుగ్గారం గురుకుల కళాశాల ద్వితీయ సంవత్సరంలో 100 శాతం, ప్రథమ సంవత్సరంలో 98 శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించింది. ప్రథమ సంవత్సరంలో మీనా 475, అశ్విని 470 మార్కులతో టాపర్లుగా నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో ఆర్. నందిని 915, కె. శిరీష 907 మార్కులతో సత్తా చాటారు. నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కూడా మెరుగైన ఫలితాలు సాధించారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో డి. లహరి 857 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, బాక్రే ఇంద్ర 819 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. సిఇసి ద్వితీయసంవత్సరం ప్రథమస్థానంలో సెద్మకిమహేశ్వరి 739, జ్ఞానేశ్వర్ కూడా ఉత్తమ ఫలితాలు కనబరిచారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షబానా తరణం, కేజీబీవీ ప్రిన్సిపాల్ రజిత, బుగ్గారం ప్రిన్సిపాల్ కృష్ణవేణి అధ్యాపక బృందంతో కలిసి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

### ఇంటర్ ఫలితాల్లో

## కుమురం భీం జిల్లా అదుర్స్..!

**- ఫలితాల్లో అమ్మాయిలు టాప్**

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**



**సామల వేదక్షర (960)**

విద్యా సాధనలో తాము ఎవరికీ తీసిపోమని కుమురం భీం జిల్లా విద్యార్థులు మరోసారి నిరూపించారు. ఆదివారం హైదరాబాద్ లో విద్యాశాఖ విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఆసిఫాబాద్ తన జోరును కొనసాగించింది. గతేడాది రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించిన జిల్లా ఈసారి 82.16 ఉత్తీర్ణతతో 3వ స్థానంలో నిలిచి తన పట్టును నిరూపించుకుంది. అదేవిధంగా ఇంటర్ రెండో సంవత్సరం ఫలితాల్లో అమ్మాయిలు అద్భుత ప్రతిభ చూపించారు. ఈ ఫలితాల్లో బాలికలు ఏకంగా 88.93 ఉత్తీర్ణత సాధించి జిల్లాను రాష్ట్రస్థాయిలో మూడవ స్థానంలో నిలబెట్టారు. మొత్తం 2,150 మంది బాలికలు పరీక్ష రాయగా 1,912 మంది విజయకేతనం ఎగురవేశారు. కాగా బాలురు 73.04 (1,595 మందికి 1,165 మంది) ఉత్తీర్ణతతో బాలికల కంటే దాదాపు 16 శాతం వెనుకబడి ఉన్నారు. ఇంటర్ పరీక్షల ఫలితాల్లో జిల్లా కేంద్రానికి చెందిన ఆసిఫాబాద్ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచ్చారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో 162 మంది విద్యార్థులకు గాను 136 మంది ఉత్తీర్ణతతో 84 సాధించగా, రెండవ సంవత్సర ఫలితాల్లో 145 మంది విద్యార్థులూ పరీక్ష రాయగా 137 మంది ఉత్తీర్ణతతో 95 . సాధించారు. ఎంపీసీ రెండవ సంవత్సరంలో సామల వేదక్షర 960, బైపీసీలో అల్లే వైష్ణవి 973, సీఈసి మాధురి బిశ్వాస్ 955 మార్కులు సాధించగా, మొదటి సంవత్సర ఫలితాల్లో కుదుపాక శ్రీ వర్ష ఎంపీసీ 449, బీపీసీలో మహాత్మ కీర్తన 422, సిఈసిలో ముంజం ఐశ్వర్య 427,ఎంఈసిలో సంజన 401 మార్కులు సాధించారు.

## ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయద్దు

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**

ఎన్నికల్లో గెలిపించిన ఓటర్ల నమ్మకాన్ని ప్రజా ప్రతినిధులు వమ్ము చేయొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఆదివారం మంచిర్యాలలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం జరిగింది. ఇటీవల ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ గా ఎండి అహ్మద్, కౌన్సిలర్లు గా బాలకృష్ణ , సాలం బిన్ అహ్మద్‌లను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి కేటీఆర్ వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో మిమ్మల్ని గెలిపించారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎల్లవేళలా ప్రజల సేవలో నిమగ్నం కావాలని సూచించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అభివృద్ధి పనుల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీకి, వ్యక్తిగతంగా మీకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవి సయ్యద్ నిసార్, అశోక్, సాయి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



**మున్సిపల్ చైర్పర్సన్, వైస్ చైర్ పర్సన్ కౌన్సిలర్లను సన్మానిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

# పక్షులు, చీమలకు ఆహారం-నీరు..

**✳ ఉపాధ్యాయుడి వినూత్న సేవ.. ✳ గన్నారం ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ ముందడుగు**
**✳ కుమారులతో కలిసి సేవా కార్యక్రమం**

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త :**

ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో చిన్న జీవుల సంరక్షణకు కాగజ్‌నగర్ మండలం గన్నారం ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు తలండి లక్ష్మణ్ వినూత్న సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. సమీపంలోని కోసిని ప్రాంతంలో పక్షులు, చీమల కోసం గింజలు ఏర్పాటు చేయడంతో పాటు మట్టి పాత్రల్లో నీటిని ఉంచి వాటి దాహాన్ని తీర్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆయన తన కుమారులు తలండి శివాన్స్, తలండి అభిరామ్‌లతో కలిసి నిర్వహించడం విశేషం. గ్రామ పరిసర ప్రాంతాల్లో పక్షులకు ఆహారం, నీరు అందిస్తూ మానవత్వాన్ని చాటుతున్నారు. చెట్లు తగ్గిపోవడం, నీటి కొరత వంటి మారుతున్న జీవవాతావరణ పరిస్థితుల కారణంగా చిన్న జీవులు మృత్యువాత పడుతున్న వాస్తవాన్ని గుర్తించిన ఆయన, ప్రకృతికి తన వంతు సేవ చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ చర్యల ద్వారా అనేక పక్షులకు ప్రాణవాయువుగా మారుతున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు లక్ష్మణ్ మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైతే ముందుగా గుర్తుకు రావాల్సింది పక్షులే. వాటి కోసం నీటి పాత్రలు, గింజలు ఏర్పాటు చేయడం మానవత్వానికి నిదర్శనం మాత్రమే కాదు, ప్రకృతి ఇచ్చే సంకేతాలను అర్థం చేసుకునే స్పందన కూడా" అని అన్నారు. ఒక చిన్న నీటి పాత్ర, కొద్దిగా గింజలు పెట్టడం పెద్ద పని కాదు. కానీ ఆచరించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రతి ఇంటి ముందు ఒక చిన్న నీటి పాత్ర ఉంచితే పరిసర ప్రాంతాల్లోని పక్షులకు జీవం లభిస్తుంది. ఇది పర్యావరణ ప్రేమికులకే కాదు, మనిషిగా మిగిలిపోవాలనుకునే ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం అవుతుంది" అని పేర్కొన్నారు. స్థానికులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, మరింత మంది ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.



**మట్టి పాత్రల్లో నీటిని ఉంచి జీవుల దాహాన్ని తీర్చే ప్రయత్నం చేస్తున్న తలండి లక్ష్మణ్, కుమారులు**

## ఇంటర్ ఫలితాలలో రాఘవేంద్ర కరిమల కళాశాల విద్యార్థుల ప్రభంజనం

**జన్నారం, ఏప్రిల్ 12, ప్రభాతవార్త**



**దాసరి కార్తీక్**



**మోవారి ఆకాష్**

జన్నారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థి బూరగడ్డ అచల్ గౌడ్ 470 మార్కులకు గాను 457 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించారు. అదేవిధంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు సైతం అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర, జిల్లా స్థాయిలో మార్కులు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి దాసరి కార్తీక్ 1000 మార్కులకు గాను 987 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో పదవ ర్యాంక్ సాధించారు. అదేవిధంగా మోవారి ఆకాష్ (981), గుమ్మడి మేఘన (965), రాగుల అక్షయ (947), సాంబారు శివాని (956) మార్కులు సాధించి బైపిసి రెండవ సంవత్సరంలో మండల టాపర్‌గా నిలిచారు. మోటూరి వైష్ణవి (944) మార్కులు సాధించి రెండవ స్థానంలో ఉన్నారు. ఈ విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ మాట్లాడుతూ గత 32 సంవత్సరాలుగా ఆది నుంచి విద్యార్థినీ విద్యార్థులకు కార్పొరేట్ కళాశాల తరహాలో చక్కని బోధన చేయడం వల్లనే ఈ ఫలితాలు రావడం జరిగిందని, మునుముందు రోజుల్లో సైతం ఇదే తరహాలో ఫలితాలు రావడానికి కృషి చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఐఐటీ, నీట్ తరహా పరీక్షలు రాయడానికి అన్ని విధాల విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను రాఘవేంద్ర విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, డీన్ హేమలత షిండే, ప్రిన్సిపల్ లక్ష్మణ్, అధ్యాపక బృందం అభినందించారు.

## ఇంటర్ ఫలితాల్లో మండల విద్యార్థుల ప్రభంజనం

**సారంగాపూర్, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:**




ఇంటర్మీడియట్ ఫలితాల్లో సారంగాపూర్ మండలంలోని వివిధ కళాశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. జాం గ్రామంలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. జాంలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కళాశాల విద్యార్థులు మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో నిహారిక 973, అనన్య 971 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో బి. సిరివెన్నెల 985, ఆర్. అక్షర 982 మార్కులతో ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరంలో జి. సాహిత్య 447, శ్రీహర్ష 440 ఎంపీసీలోనూ, జి. పూజ 434, డి. నీరజ, ఎ. సంతోషి 430 మార్కులు బైపీసీలోనూ సాధించారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు. కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో 57 మందికి 52 మంది, బైపీసీలో 47 మందికి 47 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో 35 మందికి 35 మంది, బైపీసీలో 40 మందికి 38 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ విభాగంలో బి. రుషిత 910 మార్కులతో సత్తా చాటారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 141 మందికి 112 మంది, ప్రథమ సంవత్సరంలో 161 మందికి 112 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందం, గ్రామస్తులు అభినందించారు.